# తెగిన గుండె

ఆఫీస్‌లో ఉన్నంతసేపూ చాలా అనాసక్తంగా, అస్థిమితంగా, అనీజీగా పనిచేశాను. జైల్లో బంధించినట్లు . . . ఊపిరాడనట్లు . . . బైటపడి అన్యమనస్కంగా నడుస్తున్నాను. నా చుట్టూరా జైలు . . . ఎత్తయిన, బలమైన గోడలు . . . నాతోపాటే నడుస్తూ . . .

ఇల్లు ఆఫీసుకి దగ్గరే. అడుగులు బరువుగా పడుతున్నాయి. అనంతమైన శూన్యాన్ని మోస్తున్నట్లు . . . విశ్వాంతరాళంలోని కాస్మిక్ పదార్థాన్నంతా ప్రోది చేసి నింపినా . . ఇంకా మిగిలిపోయేంత శూన్యం . . . ఏదో వెలితి . . . వెంటబడి వేధిస్తూ . . . వేటకుక్కలా తరుముతూ.

రోడ్డు మలుపు దగ్గర రెండు బస్సులు ఒరుసుకుంటూ పోయిన చప్పుడు. ఎవరో పెద్దగా కేక పెట్టారు. ఆడవాళ్ల ఏడుపులు . . . పిల్లల రోదనలు . . . హృదయవిదారకంగా అరుస్తున్నాడెవడో.

ఓ చేయి తెగి రోడ్డుకి మధ్యలో పడి ఉంది. చుట్టూ అల్లుకున్న రక్తంమడుగు తెగిపడిన చేతిని ఆత్మీయంగా సృశిస్తూ . . . ఓదారుస్తోంది. చేయి కార్చిన ఎర్రటి కన్నీళ్లు . . . రక్తాశ్రువులు.

అందరూ గుంపుగా మూగి . . . తెగిపడిన చేతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ . . .

బస్‌లోని చేయితెగిన వ్యక్తి– "నా చేయి . . . అయ్యో నా చేయి" అంటూ ఉన్మాదిలా అరుస్తున్నాడు. తన కళ్ల ముందే తన శరీరంలో ఇన్నాళ్లూ ఓ భాగమైన చేయి విడివడి రోడ్డుమీద అనాథలా పడిపోవటంతో అతను షాక్‌తో తడిసిపోయాడు. వళ్లంతా రక్తంతో తడిసిపోయినట్లు . . .

అనాలోచితంగానే అటువైపు నడిచాను. "ఎడంచేయి . . . గుడ్డిలో మెల్ల . . . " అంటున్నారెవరో. ఎంత దుర్మార్గపు మాట! చేయి చేయే కదా. వేలైనా కూడా ఎలా

వదులు కోవటం? పరిపూర్ణ శరీరంలోంచి ఓ భాగం పోగొట్టుకోవటం ఎంత బాధాకరం?

అక్కడి దృశ్యం విషాదాన్ని నింపుకుని-బరువుగా . . . చిక్కటి చీకటిలా . . . భయంగొల్పుతూ . . .

అతనికి కన్నీళ్లు రావటం లేదు. 'నా చేయి నా చేయి' అంటూ డెలీరియంలో కలవరిస్తున్నట్లు... అతని గుండె ఏడుస్తూ ఉంటుంది. హృదయ విదారకంగా...అతని శరీరంలోని ప్రతి కణం కన్నీరు కారుస్తో . . . కళ్లే . . . ఎండిన తటాకాల్లా... భయంతో నిండి . . .

అంబులెన్స్ వచ్చింది. అతను స్పృహ తప్పే ముందు కూడా భయవిహ్వలంగా తెగిపడిన చేతివైపు చూస్తూ "నా చేయి . . . నా చేయి" అంటున్నాడు.

కడుపులో వికారం నాకు. ఎవరో పేగుల్ని మెలిపెట్టి దుఃఖభరితమైన రాగాన్ని మీటుతున్నట్లు . . . పక్కకెళ్లి వాంతి చేసుకున్నాను.

గుండెల్లో బరువు . . . గూడుకట్టుకున్న విషాదం మెల్లగా ద్రవించి నరనరాల్లోకి పాకుతున్న అనుభూతి.

ఇల్లు చేరుకున్నాను. వసంత మంచినీళ్లిచ్చింది. నా ఒంటరితనంలోకి ఈ వసంత వసంతంలా వచ్చి అల్లుకుపోదేం . . . నా చుట్టూ జైలు . . . గోడలు ఆకాశాన్ని అందుకుంటూ . . . యుగయుగాల నుంచి వసంతాగమనం కోసం ఎదురుచూస్తున్న ఎండిన చెట్టులా నేను.

'కాఫీ చల్లారిపోతోంది' అంటోంది వసంత. ఎంతో దూరం నుంచి మాట్లాడు తున్నట్లు . . . పక్కనే ఉన్నా కూడా.

కిటికీ దగ్గరకెళ్లి నిలబడ్డా . . . పక్కనే ఉన్న ఖాళీ క్వార్టర్ నాకు మల్లేనే ఒంటరిగా . . .

మెల్లగా చీకట్లు అల్లుకుంటున్నాయి. చూస్తూ చూస్తూ ఉండగానే ఆ ఇంటిని చీకటి మింగేసింది. నన్ను జైలు మింగేసినట్లు . . .

వసంత విసుక్కుంటోంది. చల్లారిన కాఫీని వెచ్చబెట్టుకు రావడానికి వెళ్లింది.

కిటికీ దగ్గర నుంచి కదలాలనిపించటం లేదు. చీకటితో . . . నాలోని చీకటి . . . కలిసి పోయి . . . కబుర్లు . . .

ఏదో వ్యాన్ వచ్చి ఆ ఇంటి ముందు ఆగింది. నల్లటి చీకటిలో తెల్లటి వ్యాన్.

ఐరావతంలా . . . అందులోంచి బిలబిలమంటూ ఆడపిల్లలు దిగారు. కాలేజీ ఈడు పిల్లలు . . . దేవకన్యలా?

వాతావరణంలో ఒక్కసారిగా జలపాతపు హోరు . . . నవ్వులు . . . కేరింతలు . . . వెయ్యి దీపాలు ఒక్కసారిగా వెలిగినట్లు . . . వెచ్చటి వెలుగు . . . దీప్తి . . .అద్భుతమైన కాంతి.

మా ఇంటికి మా అమ్మాయి దీప్తి కోసం వచ్చే స్నేహితురాళ్లు పొరపాటున పక్కింటికెళ్లినట్లు . . .

'దివ్యా' అని పిలుస్తున్నారెవరో. 'దీప్తి' అని కూడా పిలుస్తారా . . . అప్పుడు నా కూతురు దీప్తి వెన్నెల వరదలా వెల్లువెత్తుతూ వస్తుందా . . .

'ఈయనొక్కడే ఏదో కోల్పోయినట్లు . . . నాకు మాత్రం లేదా అదంటే ప్రేమ . . . అయ్యో భగవంతుడా! చేయెత్తు ఎదిగిన కూతురు పోయినందుకు బాధ పడాలా లేక పాతికేళ్లకు పైగా నాతోడూ నీడా అయిన ఈ చెట్టంత మనిషిని దిగులు కూకటివేళ్లతో సహా తినేస్తున్నందుకు బాధ పడాలా . . . నా కూతుర్ని తీసుకెళ్లిపోయావు. నా భర్తను మాత్రం నాకు కాకుండా చేయకు' వసంత గొణుక్కుంటోంది. ఆమె కళ్లలో కిరాతకమైన విధిని కూడా కరిగించేటన్ని కన్నీళ్లు.

కాఫీ మరలా చల్లారినట్లుంది.

లోకంలోని మిగతా తండ్రుల గురించీ, వాళ్లకు తమ కూతుర్ల మీదున్న ప్రేమ గురించీ నాకెందుకు? నా కూతురు దీప్తికి, నాకూ మధ్య ఉన్న అనుబంధం గురించి మాత్రమే నాకు తెలుసు. అందులోని గాఢత, తీవ్రత తెలుసు . . . దీప్తి నాకు యునీక్. అది నా ప్రాణంలో ప్రాణం. శ్వాసలో శ్వాస.

అది పోయి మూడు నెలలైంది. నా జీవితాన్ని చీకటి కాటేసి మూడు నెలలు . . .

మంచి సంబంధం. అబ్బాయి బుద్ధిమంతుడు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని బంధువెవరో చెప్పినప్పుడు ఎంత సంబరపడ్డాను! పిచ్చిది వసంత. తను రోజూ చేసే పూజల వల్లనే ఇంత మంచి సంబంధం వచ్చిందని మురిసిపోయింది. దీప్తి కూడా కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివింది కాబట్టి తనకూ అమెరికాలో ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందనీ, అమ్మాయీ, అల్లుడూ సంతోషంగా ఉంటారని ఆశపడ్డాను. ఆడపిల్ల తండ్రి ఆశలు, కట్టుకున్న వాడి అత్యాశలకు బలికాక తప్పదని నాకప్పుడు తెలీదు.

కట్నమూ అడిగినంత ఇచ్చాను. ఉన్నంతలో పెళ్లి ఘనంగానే జరిపించాను. అయినా వారి దాహం చల్లారలేదు. తల్లీ, కొడుకూ కలిసి దాని రక్తంతో తమ దాహార్తిని తీర్చుకుంటారని తెలిసుంటే నా చిట్టితల్లిని, నా బంగారు కొండని కసాయి వాడివెంట మేకపిల్లని పంపినట్లు - వాడితో అమెరికాకి పంపేవాడిని కాదు.

చనిపోయిన మూడ్రోజులకు మాకు కబురందింది. ఆత్మహత్య ముసుగు తొడిగారు. మతిస్థిమితం లేదన్నారు. డిప్రెషన్‌లో నిద్రమాత్రలు మోతాదుకు మించి మింగిందన్నారు. మీ వంశంలో మానసిక రుగ్మతలున్నాయన్నారు. నిజాల్ని దాచి మీరే మోసంతో లక్షణమైన మా అబ్బాయికి మీ అమ్మాయిని కట్టబెట్టి వాడి గొంతు కోశారన్నారు.

నిజమే. ఆడపిల్లకు తండ్రి కావటమే పెద్ద రుగ్మత బాబూ - దానికి మందు లేదు. హత్యలో, ఆత్మహత్యలో జరిగి ఆడపిల్లలు చనిపోవటమొక్కటే దారి . . . మరో దారి లేదు. నా కూతుర్ని అమితంగా ప్రేమించానే . . . మానసికమైన జబ్బే బాబు. పగవాడికి కూడా రాకూడని జబ్బు . . . గుండెల్ని తూట్లు పొడిచే జబ్బు.

కేసైతే వేశాను కానీ, ఈ కోర్టులు నా కూతుర్ని తిరిగి తెచ్చివ్వగలవా? వాడిని ముక్కలు ముక్కలుగా నరికే శిక్ష విధిస్తే నా కసైతే తీరుతుందేమో కానీ, నా కడుపుకోత తీరుతుందా? దీప్తి లేదన్న నిజం నా నరనరంలో నైరాశ్యాన్ని కుండలతో కుమ్మరిస్తూ . . .

అన్నీ తానే అయి అంతా తానే అయి తిరుగాడిన ఈ ఇంట్లోంచి తను అమెరికా వెళ్లినపుడే ప్రాణం గిజగిజలాడిందే - మరి తనీ లోకంలోంచే సెలవు నాన్నా అంటూ వెళ్లిపోతే నేనేమై పోతాను? నేనిపుడు నేను కాదు. నడుస్తున్న విగతజీవిని. చీకటి సముద్రాల్ని మోస్తున్న విషాదాన్ని.

నా ఆలోచనల ప్రతి అణువులో దీప్తి జ్ఞాపకాలు దొంతర్లు దొంతర్లుగా ఉన్నట్లే ఈ ఇంటిలోని ప్రతి చదరపు అంగుళంలో ఆమెలోని విద్యుత్ లాంటి చురుకుతనం . . . ప్రవాహం లాంటి మాటలు . . . ఆత్మీయ వెచ్చదనం నిండి ఉన్నాయి.

ఇసుక తుపానుల్లాంటి ఆలోచనల్ని ఎడారిలా మారిన గుండెల్లోనే దాచుకుని పైకి గంభీరంగా కనిపించటానికి ప్రయత్నం చేస్తున్న పిచ్చి తండ్రిని నేను. గాలివానలో చిక్కుకున్న చిగురుటాకులా అనంతమైన అలజడిని మౌనంలోకి నొక్కేస్తూ . . .

“ఆంటీ” అంటూ మాధవి గొంతు. మాధవి మా అమ్మాయి దీప్తి క్లాస్‌మేట్. ఇద్దరూ ఇంజనీరింగ్ కలిసి చదివారు.

"అదిగో మన దీప్తి, మాధవీ కాలేజీ నుంచి వచ్చినట్లున్నారు చూడు" అన్నాను వసంతతో.

వసంత నావైపు విచిత్రంగా చూసింది. వెంటనే బోల్డంత దిగులుగానూ చూసింది.

"ఈ మనిషి ఏమైపోతాడో . . . భగవంతుడా . . . నేనేం చేయనూ . . . నా మాంగల్యాన్ని కాపాడు తండ్రీ" అంది మంగళసూత్రాన్ని కళ్లకు అద్దుకుంటూ.

అవును కదూ . . . దీప్తి ఆలోచనల్లో మునిగి పోయి అసలు విషయమే మర్చిపోయాను. దీప్తి చనిపోయి మూడు నెలలైంది కదూ. దీప్తి చనిపోలేదు. బుద్ధిమంతుడనుకున్న అమెరికా అల్లుడు, అమ్మ తర్వాత అమ్మనుకున్న అత్తగారు కల్సి దీప్తిని మూడునెలల క్రితం చంపేశారు. అయ్యా! అమెరికా సంబంధాల కోసం ఎగబడే పిచ్చి తండ్రులూ . . . అమాయకమైన ముఖాల చాటున మానవ మృగాలున్నాయేమో ఆలోచించండి. డాలర్ల క్రీనీడల్లో దానవత్వపు లక్షణాలు దాగున్నాయేమో క్షుణ్ణంగా వెదకండి.

కాలేజీ నుంచి వస్తూ ఇంటికి అల్లంత దూరం ఉండగానే మాధవి బైటినుంచే 'ఆంటీ' అంటూ ఇలానే పిల్చేది. అదే కాలింగ్ బజర్ మాకు . . . మృదుమధురమైన వీణానాదంలా వినిపించేది నాకు.

నా కూతురు దీప్తి . . . ఎన్నేళ్ల అనుబంధం. తను వసంత శరీరంలో అతి సూక్ష్మకణంలా రూపుదాల్చిన క్షణం నుంచి పుట్టి, పెరిగి నా గుండెల మీద ఆడుకుని . . . అల్లరిమాటలతో నన్నలరించి . . . అమ్మలా నన్ను కాపాడుకుని . . . ఆత్మీయతని పంచి . . . అనురాగాన్ని ప్రతి కదలికలో రంగరించి . . . ఇంతింతై వటుడింతై అన్నట్లు నా జీవితపు ప్రతి నిమిషంలో నిండిపోయి . . . విశ్వరూపమై . . . ఇప్పుడు వదిలి వెళ్లిపోతే . . .

ఒక్కసారిగా నవ్వు ఫెటిల్లున పేలి ఆకాశంలో వేనవేల హరివిల్లులై విరిసినట్టు శబ్దం . . . కొన్ని గంటల క్రితం వరకూ మోడువారిన చెట్టులా బావురుమన్న పక్కిల్లు ఇప్పుడు వసంతం వరించిన వనంలా ఉంది. పక్షులు వాలిన పచ్చటి చెట్టులా ఉంది. కువకువలు . . . కుహూ కుహూలు . . . చెవుల కింపుగా . . . మనసుకెంతటి సాంత్వన! మరెంతటి ఊరట! గాయం లాంటి నా కూతురి జ్ఞాపకాల మీద మరహంలా చల్లగా . . . గాజుపట్టీలా వెచ్చగా . . .

దీప్తి స్నేహితురాళ్లు మా ఇంటికొస్తే మా ఇల్లు కూడా ఇలానే ఉండేది. పక్షుల

కిలకిలారావాల్తో ఉప్పొంగిన హరితవనంలా . . . పరవళ్లు తొక్కే పచ్చటి సెలయేటి వాగులా . . . ప్రవాహమే జీవితం కదా . . .

"ఒసే జయా! తొందరగా తెములు. ఆకలేస్తోంది" ఎవరో అమ్మాయి అరుస్తోంది. "దీనికెప్పుడూ తిండి ధ్యాసేనే" మరొక అమ్మాయి పెద్దగా నవ్వింది. అక్కడ వసంతోత్సవంలా ఉంది. జీవితోత్సవం . . . బ్రతుకుపండగ.

నా కూతురూ దాని స్నేహితులూ తిరిగొచ్చిన అనుభూతి . . .

ఆఫీసు ఎప్పుడెప్పుడు వదుల్తారా అనే ఆతురతా . . . ఎగిరివచ్చి నా ఇంటిలోపల వాలి . . . కిటికీకి కళ్లు అతికించి మనోహరమైన దృశ్య కావ్యంలా-శబ్దకావ్యంలా . . . ఆ ఆడపిల్లల తుళ్లింతలు, కేరింతలు చూడటం . . . దినచర్యలో వచ్చినమార్పు.

ఏదో స్పోర్ట్స్ జరుగుతున్నట్లున్నాయి. వాటిలో పాల్గొనడానికొచ్చిన కాలేజీ అమ్మాయిలు. వెళ్లి పలకరించాలని కోరిక . . . వసంత చిరాకు . . . "ఏమని మాట్లాడ్తారూ? వాళ్ల లోకంలో వాళ్లున్నారు. మీరెందుకు పానకంలో పుడకలా" అంది.

దివ్యా ఎవరో, జయా ఎవరో, ఆకలికి తాళలేని ఆ అమ్మాయెవరో, పేరేమిటో . . . ఏ ఊరు నుంచి వచ్చారో . . . ఏ కాలేజీనో . . . వాళ్ల నాన్నల గురించి వినాలని . . .

ఆడపిల్లల తండ్రుల మీద అనంతమైన జాలి నాలో . . . ఏ కూతురు కాఫీ పెట్టబోయి గ్యాసంటుకుని కాలి మసైపోతుందో . . . కిరోసిన్‌తో తలారా స్నానం చేసి అగ్గిపుల్లతో అంటించుకుంటుందో . . . ఏ అల్లుడి ఘాతుకానికి అల్లాడిపోతుందో . . . ఎన్ని దెబ్బలు తింటుందో . . . మనసు మీదెన్ని . . . ఆత్మ మీదెన్ని . . . అన్నీ కలిపి ఎన్ని . . . భగవంతుడా . . . ఆడపిల్లల తండ్రులకు దయచేసి హృదయం ఇవ్వకు . . . దాన్ని ప్రేమతో నింపకు . . . కూతుళ్ల కష్టాల్నీ, కన్నీళ్లనూ తట్టుకోలేరు.

"కిటికీ దగ్గర ఎంతసేపని నిలబడ్తారూ? అన్నపానీయాలు వద్దా ఏమిటి?" వసంత పిలుస్తోంది.

ఆ(రోజులు అరవై సెకన్లలా గడిచిపోయాయి.

ఆరోజు ఆఫీసు నుంచి తొందరగా వచ్చేశాను. ఎట్లాగయినా సరే వెళ్లి పలుకరిస్తానీ రోజు . . . వసంత తిట్టినా సరే.

కిటికీ దగ్గర నిలబడ్డాను. వాళ్లు డిన్నర్‌కి బయల్దేరేముందు వెళ్లి మాట్లాడటం మంచిదా

లేక భోజనాలు చేసి వచ్చాక వెళ్తే మంచిదా . . . ఉన్నది ఏడో ఎనిమిదో మంది ఆడపిల్లలు . . . మా ఇంటికే భోజనానికి పిలిస్తేనో . . . వసంతకి చెప్పనా . . . విసుక్కున్నా కాదని మాత్రం అనదు.

ఎందుకో అక్కడి వాతావరణంలో ఏదో మార్పు. అవే నవ్వులు . . . అవే గలగలల మాటల జలజలలు . . . అయినా ఏదో తేడా . . .

తెల్లటి వ్యాన్ వచ్చి ఆగింది. ఒక్కొక్కరే బ్యాగుల్తో వ్యాన్ ఎక్కుతున్నారు.

"తొందరగా తెమలవే. నువ్వు సింగారించుకునే దాకా మనకోసం రైలు ఆగదు తల్లీ" అంటుందో అమ్మాయి.

అయ్యో! వెళ్లిపోతున్నారా... చెట్టుని వదిలేసి ఎగిరిపోతున్నారా... ఈ రోజు మిమ్మల్ని పలుకరించాలనుకున్నా . . . మీతో మనసారా మాట్లాడి నా ఒంటరితనాన్ని కొద్దిగానైనా జయించాలనుకున్నా . . . వస్తున్నా . . . ఉండండి ప్లీజ్ . . . ఓ క్షణం. .. చాలు. . . మీలో జయ ఎవరు? దివ్య ఎవరు? తల్లీ . . . ఆగండి . . . వచ్చేస్తున్నా . . . మీరు వెళ్లాక పక్షుల్లే కాదు నేనూ బోసిపోతాను . . . పక్షులు వాలని చెట్టులా . . .

నేను గడపదాటి వ్యాన్ వైపు అడుగులు వేసే లోపలే వ్యాన్ కదిలి వెళ్లిపోయింది.

నేను ఒంటరిగా– ఆ చీకట్లో కొద్దిసేపు నిలబడ్డాను.

నాకు దీప్తి గుర్తొచ్చింది . . . నన్ను బలంగా కొండచిలువలా అల్లుకుంటూ విషాదం.

'నాకు మనసు బావుండటం లేదు నాన్నా. మీరూ అమ్మా పదేపదే గుర్తొస్తున్నారు. మీరూ అమ్మా కలిసి రండి. వీలుకాకపోతే ఎవరో ఒక్కరైనా రండి. మీరొస్తే మీ భుజంమీద తలవాల్చి సేదతీరాలని ఉంది నాన్నా. అమ్మొస్తే ఆమె ఒడిలో పడుకుని తనివితీరా ఏడ్వాలని ఉంది' అంటూ చనిపోవడానికి నెల ముందు ఉత్తరం రాస్తే – 'దానికి మనమంటే ఎంత ప్రేమ' అనుకున్నాం తప్ప అందులోని ఆంతర్యాన్ని, ఆవేదనని అర్థం చేసుకోలేక పోయాం.

అలా వెళ్లినా నా కూతురు దక్కేదేమో . . . మధ్యతరగతి జీవిని కదా . . . మరోలా ఆలోచించాను. మేం అమెరికా వెళ్లటానికయ్యే ఖర్చుని మిగిల్చి, భద్రంగా దాచి, దీపావళి పండక్కి అల్లుడికేంకావాలో కనుక్కుని, దాన్ని కొనిచ్చి ముచ్చట తీరుద్దామనుకున్నాం. దీపావళి పండక్కి ముందే దీప్తి చావు కబురందింది. మరో పిల్లని పెళ్లి చేసుకుని, భారీగా కట్నకానుకలు పొందాలనే తన ముచ్చటని తీర్చుకోడానికి అడ్డంగా ఉన్న దీప్తిని అల్లుడే పొట్టన పెట్టుకున్నాడు.

అయ్యో! ఆ ఆడపిల్లలందరూ వెళ్లిపోయారే. వాళ్ల నాన్నల చిరునామా కనుక్కుని ఉత్తరాలు రాయాలనుకున్నాను. అయ్యా! చదువులు, ఉద్యోగాలు మాత్రమే చూసి పెళ్లిళ్లు చేయకండి. పిల్లాడు ఎర్రగా, బుర్రగా ఉంటే సరిపోదు. మంచోడో కాదో పదిమందినడిగి కనుక్కోండి. తొందరపడకండి. పదిచోట్ల వాకబు చేయకుండా తలారి చేతికి గొర్రెపిల్ల నిచ్చినట్లు కూతుళ్లని బలివ్వకండి. డాలర్ల వ్యామోహంలో పడి ఆడపిల్లల్ని దేశంకాని దేశానికి తరలించకండి.

"అక్కడే నిలబడిపోయారేం . . . వ్యాను వెళ్లి చాలాసేపయింది. బాగా చీకటి పడింది. లోపలికి రండి" అంటోంది వసంత.

నా జీవితంలో దీప్తి లేకుండా పోయాక చిక్కని చీకటిగాక వెలుతురు ఎక్కడ నుంచి వస్తుంది . . . అమెరికా సంబంధం . . . అన్ని వేల డాలర్ల జీతమనుకున్నాను తప్ప ఆ కుటుంబం ఎటువంటిదో, వాళ్ల మనస్తత్వాలేమిటో, పూర్వాపరాలేమిటో ఎంక్వయిరీ చేయాలనే ఇంగితం కోల్పోయా. 'అబ్బాయి అమెరికా నుంచి వచ్చి పదిహేను రోజులుంటాడు. వెంటనే పెళ్లి జరిపించాలి. టైంలేదు. తొందరగా చెప్పండి. మీరు కాకపోతే మరో పాతిక సంబంధాలు రెడీగా ఉన్నాయి. వీసా గడువైపోయేలోపల పెళ్లి చేసుకుని తిరిగెళ్లిపోవాలి. అబ్బాయికి మన తెలుగమ్మాయిలంటే అమితమైన ఇష్టం. అందుకు ఇండియా వచ్చాం. అక్కడ అమ్మాయిలు దొరక్క కాదు' అంటే నిజమే అనుకున్నా. అదృష్టం ఒకేసారి తలుపు తడుతుందనీ, వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడ్చుకోకూడదనీ నా శక్తికి మించిన బరువైనా తలకెత్తుకోడానికి తయారైనా.

నా గడపదాకా వచ్చింది దీప్తి పాలిట మృత్యువని గమనించలేకపోయా.

పెళ్లి చేస్తున్నాననుకున్నాను కానీ దాని గొంతు కోస్తున్నాననుకోలేదు.

కొన్ని రోజుల క్రితం నేను చూసిన ఏక్సిడెంట్ గుర్తొచ్చింది. అతని ఎడంచేయి తెగి రోడ్డుమీద పడిపోయిన భీభత్స దృశ్యం.

నా కళ్లముందే నా కుడిచేయి తెగి పడిపోయింది. నా శరీరంలో ఓ భాగం . . . తెగి . . . దూరంగా . . . ఎక్కడో అమెరికాలో . . .

నా కళ్లు ఎండిన జలాశయాల్లా . . . నా గుండె రక్తపు కన్నీళ్లు కారుస్తూ . . .

తెగిపడింది నా కుడి చేయా . . . కాదు . . . నా గుండె.

**( ఆంధ్రభూమి వారపత్రిక - 29 జులై, 2004)**